బృందావనం

మధురాంతకం రాజారాం

అసలింతకూ నేను బృందావనం వెళ్లడం ఎలా జరిగిందో చెబుతాను...

నాకొక పబ్లిషరు దొరికాడు – అంటే మీకది చాలా సాదా విషయంగా తోచవచ్చు. కాని నేనొక రచయితనని తెలిస్తే అందులోని విశేషమేమిటో మీకు బోధ పడక తప్పదు. భక్తుడికి భగవంతుడి పాదాలు ఎలాగో, నిరుద్యోగికి నచ్చిన ఉద్యోగం లభించడం ఎలాగో, అమ్మాయికి అనుకూలమైన సంబంధం రావడం ఎలాగో, రచయితకూ పబ్లిషరు దొరకడం చాలా గొప్ప విషయం. ఇంతకూ నాకు నేనై అతణ్ని వెదుక్కుంటూ వెళ్లలేదు. అతడే నన్ను పిలిపించాడు.

"మీ నవల ఒకటి వేయాలనుకుంటున్నానండీ! రెండు నెలల్లో ప్రెస్ కాపి నా చేతిలో వుండాలి...." అన్నాడు.

రెండు నెలల్లో ఒక నవల రాసి ముగించడం సాధ్యం కాదనుకుంటే, ఒక మహదవకాశం చేయి జారిపోవడం ఖాయం. ఏ వృత్తిలో ఎదురయ్యే సవాళ్లు ఆ వృత్తిలో వుంటాయి. ఏకధాటిగా రాస్తే చెయ్యి నొప్పెడుతుందని, బుర్ర వేడెక్కుతుందని, పాత్ర పోషణ దెబ్బ తింటుందని – యిలా కుంటి సాకులు చెప్పడంలో అర్థం లేదు.

నా అంగీకారాన్ని పొందిన తర్వాత అడిగాడు పబ్లిషరు – "మరైతే సబ్జక్టు మాటేమిటి?"

అవునవును. నవల రాయాలంటే సబ్జక్టు అంటూ ఒకటి వుండి తీరాలి. అందుకని "పరవాలేదు. దొరక్కపోదు. ఆలోచిస్తాను లెండి" అన్నాను.

"అక్కర్లేదు. ఒక కథా వస్తువు రెడీగా వుంది. దాన్ని మీరు నవలగా రాసిస్తే చాలు..."

"మంచిదండీ! వస్తువు కోసం జీవితాన్ని తరచి చూడవలసిన పనిగానీ, సామాజిక సమస్యల్ని అవగాహన చేసుకోవలసిన శ్రమగానీ నాకు లేకుండా చేశారు. మీ మేలు జన్మజన్మాలకూ మరచిపోలేను. ఆ కథేమిటో సెలవివ్వండి" అన్నాను.

పది నిమిషాల్లో చెప్పి ముగించి "అయ్యా! ఇదేనండి సినాప్సిస్" అన్నాడాయన. "ఈ పాయింట్లు మనసులో వుంచుకుని రాసుకుంటూ పొండి, నవల తనంతటదే తయారైపోతుంది" అన్నాడు. నా శక్తి యుక్తుల పట్ల పబ్లిషరుగారికున్న విశ్వాసానికి నేనెంతో సంతోషించాను. కానీ అందుకు నేను అర్హుణ్ని కానని మాత్రం నాకు నికరంగా తెలుసు. పోర్టికోకు బాల్కానీకి తేడా ఏమిటో స్పష్టంగా తెలియనివాడు కథను ఒక పెద్ద ప్రాసాదంలో ఎలా నడిపించగలడు? పేవ్‌మెంటు పైన నడుస్తూ రోడ్డు పైన వెళ్లే కారును ఒక ప్రయాణ సాధనంగా మాత్రమే గుర్తించిన వాడు తన కథను కారుల్లో ఎలా త్రిప్పగలడు? ఎవరిని గురించి రాయాలో వాళ్ల వేషభాషలు, నిత్యకృత్యాలు, అలవాట్లు, గుణదోషాలు, రాగద్వేషాలు, పరస్పర అనుబంధాలు మొదలైన వాటిని గురించి రచయితకు క్షుణ్ణంగా తెలిసి వుండాలి గదా! నేను పల్లెలో పుట్టి పెరిగాను. అక్కడే స్థిరపడ్డాను. పని మీద ఎప్పుడైనా పట్టణానికి వచ్చినా సాయంకాలానికల్లా తిరిగి పోవడం ఒక విధిగా పెట్టుకున్నాను. పల్లె ప్రాంతాలలోని రైతులు, కూలీలు, బడిపంతుళ్లు, వృత్తి పనుల వాళ్ళు, యింకా మరికొందరు అలాంటి వాళ్లే యింతవరకు నాకు కథా వస్తువును సరఫరా చేస్తూ వచ్చారు. శకునాలు పలికే బల్లిని కుడితితొట్టిలోకి తోసినట్టుగా మా పబ్లిషరు ఒక అలివిమాలిన పనిని నా నెత్తిపైన మోపారు. ఏది గతి నాకు?

ఈ పరిస్థితిలో మా వూరి హైస్కూల్లో హెడ్మాస్టరుగా పని చేసి రిటయిరైన రంగధామరావు గారు నన్ను ఆదుకున్నారు. ఒక శ్రీమంతుని భవంతిలో కొద్ది రోజులు మకాం పెట్టగలిగినట్టయితే అక్కడి వ్యక్తుల జీవన విధానమంతా యిట్టే ఆకళింపుకు వచ్చేస్తుందని చెప్పి, అందుకోసం ఒక ఏర్పాటు కూడా చేసి పెట్టారు.

ఆ శ్రీమంతుడి నివాస గృహమే బృందావనం.

ఆ ఇంటిని గురించి, ఇంటి ఖామందును గురించి రంగధామరావుగారు కొన్ని కీలకమైన అంశాలను చెప్పి వుంచారు.

"మునిసిపాలిటీ స్థాయిని అధిగమిస్తూ సిటీ కావడానికి అర్రులు చాస్తున్న .... నుంచి, కొంచెం దూరానికి విసరి వేయబడి నట్టుంటుంది బృందావనం. లంకంత ఆవరణ మధ్య రెండంతస్తుల పెద్ద మేడ. మేడ చుట్టూ తీర్చి దిద్దినట్టుండే పూలతోట. ఆ యిల్లూ, ఆ ప్రదేశమూ ఎంతో చల్లగా, ప్రశాంతంగా, మనోహరంగా వుంటాయి. ఏ రచయితకైనా నాలుగు రోజులుండాలనిపించే చోటు" అన్నారాయన బృందావనాన్ని గురించి.

ఇంటి యజమానిని గురించి గూడా వివరించారు – "దినపత్రికలు చదివే వాడివి గనుక ఎప్పుడో ఒకప్పుడు, ఎక్కడో ఒకచోట నీకు ఎస్. వి. నారాయణప్పగారి పేరు తారసిల్లే వుంటుంది. పూర్తి పేరు సంఘారం వెంకటనారాయణప్ప. 'పేరులోన నేమి పెన్నిధి గలదయా' అని నువ్వనుకోవచ్చు. ఒప్పుకుంటాను. పేరులో పెన్నిధులుండవు. మరెక్కడుంటాయి? పొలాల్లో, తోటల్లో, బ్యాంకుల్లో, ఇనప్పెట్టెల్లో వుంటాయి. అవన్నీ నారాయణప్ప గారికి పుష్కలంగా వున్నాయి. చతుర్భుజాల్లా నలుగురు కొడుకు లతనికి! వాళ్లు గూడా తమకు తగిన బిజినెస్సు లేవో చేసుకుంటూ బాగా సంపాదిస్తున్నారు. ఇంటి యజమాని, ఆయన భార్య, నలుగురు కొడుకులు కోడళ్లు వాళ్ల బిడ్డలు, ఇంకా వచ్చిపోయే బంధుమిత్రులు – ఇంత మంది వుంటారు గదా! ఒకరితో ఒకరికి 'క్లాష్' రాకుండా అందరికీ అన్ని ప్రత్యేక ఆగారాలు – బెడ్‌రూం, డ్రాయింగ్ రూం, అటాచ్‌డ్ బాత్‌రూంలతో సహా! విశేష సందర్భాల్లో కుటుంబ సభ్యులందరూ ఒకచోట సమావేశం కావాలంటే అందుకోసం మినీ థియేటరు లాంటి చావడి. ఉమ్మడిగా ఒక డైనింగు హాలు... అయినా తినబోతుండగా రుచులు చెప్పడమెందుకు? వెళ్తున్నావు కదా, చూస్తే నీకే తెలుస్తుంది...."

రావుగారు రాసి యిచ్చిన ఉత్తరం జేబులో పెట్టుకుని ఒక నాటి వుదయం ఎనిమిది గంటలప్పుడు నేను బృందావనం ఎదుట వాలిపోయాను.

గేటు లోపల చిన్న బెంచి పైన మరబొమ్మలా కూర్చున్నాడు గూర్ఖా. నేను కనిపించగానే అతడి పెదవులు కదిలాయి. 'క్యాహోనా?' అన్నాడు హిందీలో.

"అయ్యగారి కోసం వచ్చాను. ఆయన్ను కలుసుకోవాలి" అన్నాను.

"అయ్ గార్? గర్‌మే నహీ హై" అన్నాడు.

మంత్ర కవాటం మూసుకపోయింది. ఇంక దాన్ని తెరిపించే శక్తి నాకు లేదు. బహుశా ఈ నాటి కింక అతడు నోరు తెరవకపోవచ్చు.

వచ్చినంత దూరం తిరిగి వెళ్లాలంటే నగరంలోని బస్ స్టేషను కెంత లేదన్నా అయిదు కిలో మీటర్ల దూరముంటుంది. బస్సు గానీ, మరేదైనా వాహనం గానీ దొరుకుతుందేమోనని తారు రోడ్డు పైకి వచ్చాను. ట్రింగు, ట్రింగు మంటూ బెల్ వినిపించింది. తిరిగి చూచాను. ఒక సైకిలు రివ్వున నా ప్రక్కన్నుంచే దూసుకపోయి గేటు ఎదుట ఆగింది. గూర్ఖా అటెన్షనులో నిలబడి సెల్యూట్ చేశాడు. తర్వాత తలుపులు తీయడం కోసం గేటు వైపు నడిచాడు.

సైకిలు పైన వచ్చిన వ్యక్తి నన్ను చూచి క్రిందికి దిగాడు.

"ఏమండీ! ఎవరి కోసమైనా వచ్చారా?" అని పలకరించాడు.

బాబ్బాబూ! నువ్వెవరివో గానీ సమయ సంజీవిలా

దొరికావు – అనుకున్నాను. "అవునండీ! నారాయణప్ప గారి కోసం వచ్చాను. రిటయిర్డు హెడ్మాస్టరు రంగధామరావుగారు ఆయనకో ఉత్తరం రాసి యిచ్చారు" అన్నాను.

"అట్లాగా, అయితే రండి" అంటూ అతడు ముందుగా దారి తీశాడు. పూల మొక్కల నడుమ ఉదయకాలపు నీడలు పరచుకున్న సిమెంటు బాట గుండా నడుస్తున్నాము.

"రావు గారు బాగున్నారు కదండీ! చాలా రోజులయింది చూచి. ఏ రెండేళ్లకో, మూడేళ్లకో వస్తుంటారు. వచ్చిన రోజు రాత్రి ఆయనకు, మా అయ్యగారికి నిద్రుండదు. చిన్ననాటి సంగతులు నెమరు వేసుకోడంతో నే సరిపోతుంది. రావుగారి పైన మా అయ్యగారి కొకందుకు కోపం వుందిలెండి! ఎందుకంటే ఆయన ఈయన్నెప్పుడూ ఏ సహాయం కోసంగాని అర్థించలేదట! నీ డబ్బు, నీ హోదా నీ దగ్గరే వుండనీ. వాటితో నాకేమి అక్కర్లేదు – అనేది రావుగారి దృక్పథం. మొత్తం మీద భలే స్నేహితులు...."

బృందావనంలో యిలాంటి వ్యక్తి ఒకతను వున్నట్టు చెప్పనందుకు ఆ క్షణాన నాక్కూడా రావుగారి పైన కోపం వచ్చింది. అయితే అవతల వ్యక్తి అవులిస్తే ప్రేవులు లెక్కబెట్టే వాడు గావడం వల్ల నా పని కాస్త సుగమమైపోయింది.

"నేను నారాయణప్ప గారి పి. ఎ. నండి! నా పేరు లాజరస్" అంటూ అతడు నాకు సందేహ నివృత్తి చేశాడు.

"ఆయన యింట్లో లేరని గూర్ఖా మూలంగా తెలిసింది" అన్నాను.

"అవును. ఏదో కంపెనీ డైరక్టర్ల మీటింగుందని మెడ్రాస్ వెళ్లారు. సాయంకాలానికి రావచ్చు. అన్నట్టు మీ రేం పని మీద వచ్చారో? రహస్యం గాకపోతే నాతో చెప్పొచ్చు...."

"అబ్బే, రహస్యమేమీగాదు. రావుగారు కూడా కవరతికించకనే ఉత్తరం నా చేతి కిచ్చారు. చదివితే మీకే తెలుస్తుంది...."

ప్లాట్‌ఫారంలా ఎత్తుగా వున్న వసారాలో రోడ్డుకు అభిముఖంగా వున్న గదే లాజరస్ ఆఫీసు. అంతే వెడల్పున్న వసారాలో ఆ కట్టడం కుడి ఎడమలకు అర్ధచంద్రాకారంగా విస్తరించి వుంది.

సైకిల్‌కు తగిలించు కొచ్చిన సంచుల్లో నుంచి లాజరస్ రకరకాల వస్తువులను పైకి తీశాడు. కాలింగ్ బెల్ నొక్కగానే పరుగెత్తి వచ్చిన నౌకరుతో "ఇదిగో గంగన్నా! ఈ పెట్టె అమ్మగారి కివ్వు. ఈ పత్రికలు సులోచనమ్మ గారికి. ఈ పార్సెల్ హేమాదేవిగారికి. ఈ కేసెట్స్ తీసుకెళ్ళి చినబాబు గారి టేబిల్ పైన పెట్టు" అన్నాడు. ఆయా వస్తువులతో గంగన్న గుమ్మం దాటిపోయాక "ఏమోయ్ గంగన్నా! మాకు రెండు కాఫీలు" అని పురమాయించాడు.

కాఫీ వచ్చేలోగా అతడు రావుగారి ఉత్తరాన్ని చదివేశాడు. ముగింపు దగ్గరికి వచ్చేసరికి సన్నగా ఒక లేనవ్వు అతడి పెదవి పైన చిందులాడింది. "అయ్యగారితో పనిబడి ఎందరెందరో వస్తుంటారు. కాని యిలాంటి పనిమీద మాత్రం ఎవ్వరూ రాలేదు" అన్నాడు.

అతడి అభిప్రాయం పైన నేనేమి వ్యాఖ్యానించలేదు.

గంగన్న కాఫీలు పట్టుకొచ్చేసరికి లాజరస్ నా విషయంలో ఒకనిర్ణయం తీసుకోగలిగాడు – "గంగన్నా! ఇదిగోనయ్యా తాళం చెవి. తూర్పు వైపు గదుల్లో మొదటిది తెరువు. అక్కడేదైనా సర్దవలసి వుంటే చూడు. అదో, మేష్టరు గారి బ్రీఫ్ కేసు తీసుకెళ్లి గదిలో పెట్టు...."

"అతిథులకోసం బృందావనంలో నాలుగు గదులున్నాయి లెండి మేష్టరు గారూ!" నా వైపు తిరిగి కొనసాగించాడు– "అందులో అయ్యగారి కోసం ఎవరైనా వస్తే వుండే గది ఒకటుంది. అందులో మీరుండొచ్చు. ఎలాగూ మీరొక వారం రోజులైనా వుండాల్సిన పని గదా! మీ అవసరాలన్నీ గమనించే పూచినాదే! అందులో ఏదైనా లోపం జరిగితే అయ్యగారికి నేను జవాబు చెప్పుకోవలసి వస్తుంది. రండి. చెబుతాను...."

చెప్పడాని కేముంది! సర్వాలంకరణ భూషితురాలై విభునికోసం వేచివున్న వాసవసజ్జికలా ఆ గది నా కోసం సిద్ధంగా వుంది. దిన, వార పత్రికలు కొన్నిట్ని తెచ్చి లాజరస్ బల్లపైన పడేశాడు. "ఇదేనండీ గది! మీకేదైనా కావలిస్తే కాలింగ్ బెల్ నొక్కండి. గంగన్న పలుకుతాడు. కాఫీ, టిపిన్లు యిక్కడికే వస్తాయి. మీరు డైనింగ్ హాల్లోకి వెళ్లి భోంచేసినా సరే. లేదా ఇక్కడికి తెప్పించుకున్నా సరే. గంగన్న తెచ్చి పెడతాడు. నేను మధ్యాహ్నం పన్నెండు దాకా



యిక్కడుంటాను. ఆపైన టౌనుకు వెళ్ళి అయిందిటికో, ఆరింటికో తిరిగొస్తాను. ఏమండీ మేష్టరు గారూ! సరేనా! మళ్ళీ కలుసుకుందాం...."

నియమబద్ధంగా పని తర్వాత పనిలోకి దూకే సర్కస్ మేనేజరులా లాజరస్ తన తరువాతి కార్యక్రమాన్ని గమనించడానికి వెళ్ళి పోయిన తర్వాత నేనా గదిలోని పేము కుర్చీలోకి ఒదిగి పోయాను. కానీ ఊరికే కూర్చోడం సాధ్యం కాదు గదా! కిటికీలు చూచాను, కిటికీలకు గట్టిన తెరల్ని చూచాను. గోడల్ని చూచాను, గోడలకు తగిలించిన చిత్తరువుల్ని చూచాను. పాలుబోసి పాలెత్తుకోవచ్చునని పిస్తున్న గది నేల వైపు చూచాను, దానిపైన పరచిన తివాచిని చూచాను. అద్దంలా మెరిసి పోతున్న పైకప్పును చూచాను, ఆ పైకప్పు నుంచి వ్రేలాడుతున్న దీప సముదాయాన్ని చూచాను. ఇంకా సోఫాలు, మంచం, పరుపు, నిలువు టద్దం, వాష్ బేసిన్, నీళ్ల కూజా లాంటి వస్తు సామగ్రినంతా చూచాను. ఒక చిన్న సైజు మ్యూజియంలో వున్నట్టే వుంది అప్పటి నా పరిస్థితి. ఒక అరగంట క్రితం నడి రోడ్డుపైన నిరాశ్రయుణ్ణిగా వున్నవాణ్ణి, యిప్పుడీ గదిలో వుండడం తలచుకుంటే అదొక నమ్మరాని విషయంగానూ, పరమాద్భుతమైన ఉదంతంగానూ తోస్తూ వుంది.

కొంతసేపు పత్రికలు తిరగేశాను. చేతిలోని పత్రికను అలాగే జారవిడిచి కుర్చీలోనే కునుకు తీశాను. భోజనం గదిలోకే తెప్పించు కున్నాను. తిని లేచేసరికి భుక్తాయాసం ముంచు కొచ్చేసింది. రెక్క తలుపులు ఓర వాకిలిగా వేసి సోఫాపైన సోలిపోయాను. గాఢంగా నిద్ర పట్టేసింది. మెలకువరాగానే వులికి పడ్డట్టుగా వాచీ వైపు చూచుకున్నాను. గంట నాలుగున్నరయింది. నేను నిద్రలో వుండగా గంగన్న గదిలోకి వచ్చి వెళ్ళి నట్టున్నాడు. టిపాయ్ పైన ఫ్లాస్కు కనిపించింది. కానీ లేచి వెళ్ళి ఫ్లాస్కులోని కాఫీ తీసుకోడానికి సైతం బద్ధకం అడ్డు తగిలింది. కనురెప్పలు మళ్ళీ బరువెక్కి క్రిందికి వ్రాలి పోయాయి. అలా కొద్ది నిమిషాలు గడచి వుండొచ్చు. నిశ్చల కాసారంలో

బృందావనం

చిన్న గులకరాయి ఒకటి పడి మెల్ల మెల్లగా అలలు బయల్దేరినట్టుగా దగ్గర్లో చిన్న కదలిక ఏదో వినిపించినట్లై కళ్ళు తెరిచాను. మల్లె పందిరిలో ఆకుల చాటు నుంచి ఈవలికి వచ్చిన ఒకే ఒక మల్లె మొగ్గలా, తోటంతా తిరిగి తిరిగి చివరకు పొదరింటి పూల రెమ్మపైన వాలిన సీతాకోక చిలుకలా ఒక ఆరేడేళ్ల అమ్మాయి – కడిగిన ముత్యంలా కుర్చీలో కూర్చుని వారపత్రికలో బొమ్మలు చూస్తోంది.

ఉన్నట్టుండి మనసులో కొన్ని విచిత్రమైన ఊహలు పుదుతుంటాయి. అందుకు కారణ మేమిటో స్ఫురించదు. ఆ అమ్మాయి కనిపించేసరికి నాకు చేజారిన అమూల్యమైన వస్తువేదో దొరికినట్టయింది. ఎండ దెబ్బ తగిలిన వాడికి చల్లటి ఆశ్రమం లభించినట్టయింది. దాహంతో నాలుక పిడచ గట్టుక పోయినవాడికి చలిచెలమ ఒకటి చేరువకు వచ్చినట్టయింది.

"అమ్మాయ్! నీ పేరేమిటమ్మా?" అని అడిగాను.

పత్రికలో నుంచి తల పైకెత్తకనే, ఒక కంటిని మాత్రం నా వైపు త్రిప్పి ఆ పాప చెప్పింది – "రాధిక"

"గుడ్. బాగుందమ్మా! బృందావనిలో రాధిక– అందమైన ఒక బాలిక– సవ్వడిలేని పూలతోటలో రవళించెను ఒక గీతిక...."

ఆ పాప కళ్ళు పెద్దవై పోయాయి. వారపత్రిక మూసేసింది. – "ఏమండీ! మీరు పాటలు చెప్పేస్తారా అండీ?"

"ఎప్పుడైనా నోటి కొస్తే చెప్పేస్తాను. కానీ ఇప్పుడిది నేను చెప్పింది గాదు. నువ్వే చెప్పించుకున్నావు...." అన్నాను.

కాసేపు తటపటాయించి ఆమె అడిగింది– "ఏమండీ! ఆ పాట నాకు రాసిస్తారా? కాన్వెంటులో పాటల పోటీ జరిగితే పాడ్డానికి...."

"ఇది నిన్ను చూచి ఇతరులు పాడే పాటమ్మా! కావలిస్తే నువ్వు పాడే పాటలు మళ్ళీ తీరిగ్గా రాసిస్తాను... అన్నట్టు బడికి సెలవులా ఏమిటి? ఇంటి దగ్గరే వుండి పోయావే...."

"మా కాన్వెంటుండడం యిక్కడ కాదండీ! బెంగుళూర్లో. నాకు జబ్బొచ్చిందిగా! మా డాడీ యింటికి తీసుకొచ్చేశారు."

పాప నీరసంగా వుండడానికి, ముఖం పాలిపోయి వుండడానికి కారణం బోధపడింది. "ఏం జబ్బొచ్చిందమ్మా? నయమై పోయింది గదా? పథ్యం పుచ్చుకుంటున్నా వేమిటి?" అని అడిగాను.

"ఇంకా పదేను రోజుల దాకా కాన్వెంటుకు వెళ్ళొద్దన్నారు– డాక్టరు గారు. ఏమండీ! మీరు పాట లేనా, కథలు గూడా చెబుతారా?"

"నీకు వినాలనుంటే కథలు గూడా చెబుతానమ్మా! ఎలాంటి కథలు కావాలి నీకు?"

పాత జ్ఞాపకాలేవో నెమరు వేసుకుంటున్నట్టుగా పాప ఆలోచనలో పడి పోయింది. ఆ ఆలోచన ఒక కొలిక్కి రావడానికి కొద్ది నిమిషాలు పట్టింది. "ఏమండీ! తల్లిని కాపాడిన రాజకుమారుడి కథ తెలుసా మీకు? కాన్వెంటులో మా టీచరు చెప్పింది. సాయంకాల మైందట. పొద్దు పోయిందట. చీకటి పడిందట. చుట్టూరా కొండలేన్ట. మధ్యలో దారి. ముందుగా పల్లకీ పోతోందట. వెనుకన్నే గుర్రంపైన రాజకుమారు డొస్తున్నాట్ట. అప్పుడే మైంది? దొంగలు సీం బొగ్గులా నల్లగా, యింతింత లావు మీసాల్తో, కేకలేస్తూ వొచ్చి వొచ్చి పల్లకీ మీదపడ్డార్ట. అప్పుడేమో రాజకుమారుడు కత్తి తీశాట్ట. దొంగలపైన దూకాట్ట. ఏటు కొక్కణ్ణి నరికేశాట్ట. ఏమండీ! అలాంటి రాజకుమారుడి కథ తెలుసా మీకు?"

"తెలుసమ్మా! కానీ అది చాలా పేద్ద కథ. ఇప్పుడు కాదు. రేపుదయం నువ్వొస్తావా యిక్కడికి?"

"వస్తానుగా! మరిచేపోను. కథలంటే నాకు చాలా యిష్టం. పోనీ, ఇప్పుడొక ఆటుంది. భలే తమాషా ఆటది. మీరొకదాన్ని మనసులో తల్చుకోవాలి. అదేమిటో నేను చెప్పేస్తాను...."

కొద్ది క్షణాలాలోచించి నేనన్నాను– "అట్లాగేనమ్మా! తల్చుకున్నాను...."

"ఇప్పుడు నేను కొన్ని ప్రశ్న లడుగుతాను. అవును, కాదు, వుంది, లేదు అని మాత్రం జవాబు చెప్పాలి...."

"అట్లాగే!"

"మీరు తల్చుకున్న దానికి ప్రాణముందా?"

"ఉంది."

"దానికి రెండు కాళ్ళుంటాయా?"

"ఊఁహూ...."

"నాలుగు కాళ్ళుంటాయా?"

"ఉంటాయి...."

"అది అడివిలో వుంటుందా?"

"ఊఁహూ...."

"ఊళ్లో వుంటుందా?"

"ఉంటుంది."

కాసేపు ఆలోచనలో పడిపోయాక అడిగింది, "అదెక్కువగా వీధుల్లో వుంటుందా? అంటే ఇంటికి బయటుంటుందా అని"

"ఊఁహూ."



"ఇంట్లో వుంటుందా?"

"అవును."

"తెల్సిపోయింది. చేతులు తడుతూ అంది పాప 'అది పిల్లి!'"

"భలే, భలే! ఎలా కనిపెట్టేశావమ్మా!" అంటూ నేనూ నవ్వేశాను.

"ఇప్పుడు నేను తల్చుకుంటాన్న. మీరు చెబుతారా?" మళ్ళీ ప్రారంభించింది పాప.

"సరేనమ్మా! మరి నేనోడిపోతే నువ్వు నవ్వగూడదు."

"అబ్బే. మీరోడిపోరుగా! గెలుస్తారు. నాకు తెల్సు. ఉండండి. నేనొకటితల్చుకున్నాను...."

"మంచిదమ్మా! దానికి ప్రాణముందా?"

"లేదు." ఎంతో గుంభనంగా చెప్పింది జవాబు.

నా గొంతుకలో వెలక్కాయ పడ్డట్టయింది. ప్రాణం లేని వస్తువులు ప్రపంచంలో చాలా వున్నాయి. రాళ్ళు, ఇళ్ళు, కుర్చీలు, బల్లలు, బట్టలు....

"ఫస్టయింగదా! మీకు తెలిసుండదు. నేను చెప్పేస్తా నంకుల్! అది నేలపైన వుంటుందా అని అడగాలి."

"సరేనమ్మా! నీ అడుగుజాడల్లోనే నడుస్తాను. అది నేలపైన వుంటుందా?"

"ఊఁహూ."

"నీటిలో వుంటుందా?"

"ఊఁహూ."

ఏమిట్రా యిది! నేలా నీరూగాక ఈ భూ ప్రపంచకంలో యింకే ముంది? ఆఁ! జ్ఞప్తి కొచ్చింది. "ఏమమ్మా! ఆకాశంలో వుంటుందా అది?"

"ఊఁ. ఉంటుంది."

"పగల్లో కనిపిస్తుందా?"

"ఊఁహూ."

"రాత్రుల్లో?"

"వొచ్చేస్తున్నారూ. దగ్గరి కొచ్చేస్తున్నారూ. రాత్రులో కనిపిస్తుంది...." ధీర్ఘాలు తీస్తూ అంది పాప.

విజయగర్వంతో నేనడిగాను– "ఏమమ్మా! అది పిల్లలందరికీ నేస్తమా?"

"భలే భలే! మీ రోడి పోలేదు. కనిపెట్టేశారు...."

"ఈ ఆట చాలా బాగుందమ్మా! నేనిక్కడి నుంచి వెళ్ళాక మా ఊళ్ళో వాళ్ళ కందరికీ నేర్పిస్తాను...."

"మీకు నేను ఆట నేర్పించానా! మీరు నాకు కథ చెప్పాలి అంకుల్!"

"చెబుతానమ్మా! రేపుదయం నువ్వు రావడమే తరువాయి."

"ప్రామిస్...." పాప చెయ్యి సాచింది.

చేతిలో చెయ్యి వేసి "ప్రామిస్‌గా చెబుతాను" అన్నాను.

"వొస్తా నంకుల్! గుడీవినింగ్...."

ఆ నాటి సాయంకాలం ఆరు నుంచి ఎనిమిదింటి దాకా నాకు లాజరస్‌తో కాలక్షేపం జరిగింది. నేనతడి గదిలో వుండగానే మదరాసు నుంచి ఫోను వచ్చింది. నారాయణప్పగారు ఏదో కోర్టు వ్యవహారంపైన



వినాయకుడు
చిత్రకారుడు: వి. వెంకటేశ్వరరావు

బృందావనం

మదరాసు నుంచి అట్లాగే హైదరాబాదు వెళ్తున్నారట. రెండు మూడు రోజుల్లో తిరిగొస్తారట. "రంగధామరావు గారు ఒకాయన్ను మీ దగ్గరికి పంపారు. ఆయన కొన్ని రోజులు మన యింట్లోనే వుంటారు. ఇప్పుడిక్కడే వున్నారు. మాట్లాడుతారా?" అని అడిగాడు లాజరస్. 'వద్దొద్దు. తరువాత తొచ్చి మాట్లాడతాను. ఆయన కన్ని వసతులూ కుదిరేటట్టు చూడు" అన్నారట నారాయణప్పగారు.

రాయల్ గెస్టునుగా నాకు లాజరస్ ద్వారా లాంఛన ప్రాయమైన గుర్తింపు లభించింది. ఇప్పుడా ఫర్మానాపైన నారాయణప్ప గారి ఆమోదముద్ర గూడా పడింది. ఇంక పరవాలేదు. వొచ్చుక పోవచ్చు.

"ఏమండీ లాజరస్ గారూ! నన్నీ యింట్లో వాళ్ళకు పరిచయం చెయ్యగూడదా?" అని అర్థించాను.

"మేష్టరుగారూ! నేనూ అదే ఆలోచిస్తున్నా. నారాయణప్పగారి నలుగురు కుమారుల్లో యిప్పు డొక్కరు మాత్రమే ఊళ్ళో వున్నారు. పెద్దబ్బాయి కంట్రాక్టరు. ఆయన నెల్లూరులో ఒక సినిమా థియేటరు కట్టిస్తున్నారు. ఇంటి కెప్పుడు వస్తాడో, ఎప్పుడు వెళ్తాడో చెప్పలేము. రెండో అబ్బాయిది వ్యవసాయ శాఖ. ఆయన ట్రాక్టరు కొనుక్కురావడం కోసం కోయంబత్తూరు వెళ్ళాడు. ఆయన తిరిగి రావడం వెళ్ళిన పని పూర్తి కావడంపైన ఆధారపడి వుంటుంది. మూడో అబ్బాయి కిక్కడే ఎలక్ట్రికల్ గూడ్స్ వ్యాపారం. ఉదయం టిఫిన్ చేసి వెళ్తే యిక రాత్రి పది గంటల తర్వాతనే ఆయన తిరిగి రావడం. మధ్యాహ్న భోజనం కారియర్‌లో వెళ్ళి పోతుంది. పోతే చినబాబు సంగతి. ఈయన రకరకాల ప్రయోగాలు చేసి చివరికి ఐసు ఫ్యాక్టరీలో స్థిరపడ్డాడు. ఇటీవలే ఒక కారు కొన్నాడు లెండి! ఈ యింటికది అయిదో కారు. ఈ రోజు తెల్లవారు జామున కొత్త వెహికల్‌ను తీసుకుని తిరుపతి కొండకు వెళ్ళాడాయన– స్వామివారికి అర్చన చేయించడం కోసం...."

"పోనీ, సాహిత్యాభిరుచి కలిగిన వాళ్ళెవరైనా వుంటే చెప్పండి...." అన్నాను. రచయిత ఉనికికి యింత పరిగణన, మన్నన లభించేది పాఠకుడి సాన్నిధ్యంలోనని నా నమ్మకం.

"సాహిత్యం! అంటే పత్రికలు చదివే వారిని గురించా మీరడిగేది! రావడానికి యింటికి అన్ని పత్రికలూ వస్తాయి. కానీ నాకు తెలిసి సినిమా పత్రికలకే డిమాండు ఎక్కువ. హేమాదేవిగారు ఇంగ్లీషు పత్రికలు మాత్రమే చూస్తారు. తెలుగు పత్రికల కోసం ఎదురు చూచేది ఒక సులోచనమ్మ గారే. ఏజంటు పంపేదాకా ఆమె ఓపిక పట్టదు. సీరియల్ నవల లంటే ఆమెకు చాలా యింటరెస్టు. సస్పెన్సు, హారర్ అంటే మరీనూ...."

కోటలో ప్రవేశించాలని నా ప్రయత్నం. ఏవైపు నుంచి ప్రవేశించాలన్నా కవాటం మూసేవుంది.

"ఏమండీ లాజరస్ గారూ! ఈ యింట్లో అందరూ ఒకచోట కూర్చుని భోజనం చేయడంగానీ, కలిసి మాట్లాడుకోడంగానీ ఎప్పుడైనా వుంటుందా?" అని అడిగాను.

"ఎందుకుండదు? ఉగాది నాడందరూ కలిసి భోం చేశారు. ఇక దీపావళికే! అన్నట్టు వాళ్ళలో వాళ్ళ కేమీ విరోధాలు లేవండీ బాబూ! అస లందుకు చోటే లేదు. వంట చేయడానికి, వడ్డించడానికి మనుషు లున్నారు. ఎవరి కిష్టమైనప్పుడు వాళ్ళు వెళ్ళి భోజనం చేస్తారు. ఎదురైతే పలకరించు కుంటారు. విడిపోతే పట్టించుకోరు. అసలొక వస్తువు లేకపోతేనే గదండీ దానికోసం వెంపర్లాడడం! అన్నీ వున్నప్పుడు యింక పేచీ ఎందు కుంటుంది? పోతే కాలం గడవడ మెలాగంటారా? అందుకుండనే వున్నాయి గదా రేడియోలు, టేప్‌రికార్డర్లు, టి.వి.లు, వీడియోలు...."

లాజరస్‌ను వదిలిపెట్టి నేను నా గదిలోకి వచ్చేశాను. గంట తొమ్మిది కాబోతుండగా గంగన్న వచ్చి, "భోజనం గదిలోకి తెమ్మంటారా?డైనింగ్‌హాలు కొస్తారా?" అని వాకబు చేశాడు. అతని కంఠంలో ఆర్ద్రత లేదు. "ఇది నా పని. దీన్ని నెరవేర్చడం నా బాధ్యత, అన్న కర్తవ్యస్ఫురణ మాత్రమే వుంది.

ఆ ముచ్చట గూడా తీర్చుకుందామని గంగన్న వెంట డైనింగుహాల్లోకి వెళ్ళాను. నేను వెళ్ళేసరికి అక్కడ యిద్దరు మహిళలు భోజనం చేస్తున్నారు. వాళ్ళు నావైపు ఎగాదిగా చూచారు. తరువాత ఒకరివైపొకరు చూచుకున్నారు. ఆగంతుకు డెవరో నాకు తెలియదంటే నాకు తెలియదన్న భావం ఆ చూపుల్లో ధ్వనించింది.

"చపాతీలు, ఇడ్లీలు, భోజనం. ఏది పెట్ట మంటారు?" అన్నాడు వంట మనిషి. ఇడ్లీలే పెట్టమన్నాను. ఒక యిడ్లీ తిని తిరిగి చూచేసరికి కుర్చీలు ఖాళీగా వున్నాయి. ఇందాకా అక్కడ భోజనం చేస్తూ వుండినవాళ్ళు పిల్లినంత వేగిరంగా ఆ పని ముగించి వెళ్ళి పోయారేమోనన్న అనుమానం ఒక్కపట్టాన నన్ను వదిలిందిగాదు.

రాత్రి పడుకోడానికి ముందుగా నా నోట్‌బుక్‌పైకి

తీసి అందులో కొన్ని ముఖ్యమైన అంశాలు వ్రాసుకున్నాను. 1. పన్నెండు గంటల క్రితం నేనీ యింట్లో ప్రవేశించాను. అప్పటినుంచీ నా పాలిటికి కాల చక్రం ఆగి పోయినట్టుంది. 2. ఇక్కడ నాకు సమకూరిన సదుపాయాల్ని తప్పు పట్ట జూడడం చెక్కర తిని చేదనడమే! ఎటొచ్చీ మొదటి తరగతి రాజకీయ ఖైదీకన్నా నా పరిస్థితి మెరుగ్గా లేదు. 3. ఈ యింటికి సంబంధించిన విలక్షణం యిక్కడ మనుషు లున్నారనేందుకు దాఖలా లేకపోవడమే! ఎంతో జాగ్రత్తగా ఆలకిస్తే మాత్రం ఎప్పుడైనా వినిపించే అడుగుల చప్పుడు, వంటింట్లో పాత్రలు కడిగే శబ్దం, ఉండి వుండి తోటలో నుంచి వినిపించే పక్షుల కూతలు, గాలిని కోస్తున్నట్టుగా మేడ దగ్గరికి వచ్చి, మళ్లీ అట్లాగే దూరమై పోయే కార్ల అలికిడి, యిది తీసేస్తే యిదొక స్తబ్ధ ప్రపంచం. 4. ఇట్లాగే వారం రోజులు గడిస్తే నా బుద్ధి గూడా స్తబ్ధమై పోయే ప్రమాదం వుంది. ఈ ప్రమాదం నుంచి నన్ను రక్షించ గలిగితే ఒక ఏడేళ్ల అమ్మాయి మాత్రమే రక్షించాలి....

మరునాటి ఉదయం నాకు చాలా ఆలస్యంగా పది గంటలకు తెల్లవారింది. బాల భానుబింబం "రాధిక" అనే అమ్మాయి రూపంలో ప్రత్యక్షమై గదిలో వెలుగులు విరజిమ్మింది.

"ఏమమ్మా! ఇక్కడ నాకేమి పాలుపోవడం లేదు. ఎప్పుడెప్పుడొస్తావా అని ఎదురు చూస్తున్నా! ఇప్పుడా రావడం? ఎందుకమ్మా ఆలస్యం?" పసిపాపతో నిష్ఠూరాలాపాలు ఆడగూడదన్న యింగితం గూడా నాకు లేకపోయింది.

"రాత్రి నాకు "లయిటు"గా జొరమొచ్చిందట! మమ్మి నన్ను కదలకుండా పడుకోమని చెప్పింది...."

"మరైతే నువ్వొచ్చేశావే!"

"మమ్మీ లేదుగా! ఇందాకా కారు శబ్దం వినిపించలా, అందులో ఎళ్లి పోయింది. నేను మెల్లగా లేచొచ్చేశాను...."

"అయ్యో. అట్లాగా! నేను నువ్వింకా మరిచి పోయావేమో అనుకున్నాను...."

"లేదంకుల్! కథ చెప్పరూ? రాజకుమారుడి కథ...."

"చెబుతానమ్మా! నువ్వు ముందు కుర్చీలో కూచో...."

పేము కుర్చీ పెద్దది. పాప చిన్నది. కుర్చీలో పాప బుదుంగున మునిగిపోయి నట్టయింది.

"అమ్మాయ్ రాధికా! నువ్వెప్పుడైనా బాల నాగమ్మ అనే పేరు విన్నావా?"

తెలియదన్నట్టుగా క్రింది పెదవి ముందుకు సాచి, అడ్డంగా తలాడించింది రాదిక.

"పానుగంటి పట్నానికి ఏడుగురు రాజులు. ఆ ఏడుగురు రాజులకూ ఏడుగురు రాణులు. రాజుల్లో చిన్న రాజు కార్యవర్ధి రాజు. రాణుల్లో కడగొట్టు రాణి బాలనాగమ్మ. ఆ బాలనాగమ్మ ఎటువంటిది? గొప్ప సౌందర్యవతి. అంటే ఎంతో అందంగా వుంటుందన్న మాట! ఆమె అందచందాలను గురించి మాయల మరాఠీకి తెలిసింది. మాయల మరాఠీ అంటే ఎవరు? పరమ దుర్మార్గుడు. జడల జుత్తు, జీబురు గడ్డం, మిడిగ్రుడ్లు – అమ్మో, వాడి పేరు చెబుతే పసిపిల్లలు పాలు తాగేవాళ్లు కారు. మంత్ర తంత్రాల్లో వాడు నిపుణుడు. తలచుకుంటే వాడు మట్టి ముద్దను రవ్వలడ్డుగా మార్చెయ్య గలడు. వేపాకుల్ని ఎర్ర తేళ్ళుగా మార్చెయ్య గలడు. రాతిని కోతిగా మార్చెయ్య గలడు. అలాంటి మాయల మరాఠీ మారు వేషం వేసుకుని, శంఖం ఒకటి చేతబట్టుకుని, శంభో శంకర.... శంభో శంకర అనుకుంటూ బాలనాగమ్మ కోసం బయల్దేరాడు...."

అమ్మాయి కళ్లల్లో ఆందోళన.

"అప్పుడు పానుగంటి పట్నంలో ఒక్క రాజైనా లేడు. అందరూ యుద్ధానికి వెళ్లి పోయారు. మాయల మరాఠీ రాచనగరు ముందు నిలబడి "శంభో శంకర" అంటూ శంఖం పూరించాడు. పెద్ద రాణి భిక్షం తీసుకొచ్చింది. "ఛీ, పో. సంతానం లేని స్త్రీ బిక్షం పెడితే నేను స్వీకరించను" అన్నాడు. ఏడుగురు రాణుల్లోనూ అప్పటికి బిడ్డతల్లి బాలనాగమ్మ మాత్రమే. ఆమె బిక్షం తీసుకొచ్చింది. మాయల మరాఠీ జోలెలో నుంచి మంత్ర దండాన్ని పైకి తీసి ఓం హ్రీం క్లీం అంటూ మంత్రాన్ని బాలనాగమ్మ పైకి ప్రయోగించాడు. ఆమె నల్ల కుక్కగా మారిపోయింది. మెడకు తాడు తగిలించి ఆ నల్ల కుక్కను లాక్కుంటూ మాయల మరాఠీ తాను నివసించే నాగళ్లపూడి గట్టుకు వెళ్లి పోయాడు...."

ఊఁ కొట్టడంలో క్రమ క్రమంగా స్థాయి తగ్గుతూ రావడం గమనించి, ఒకటి రెండు క్షణాలు ఆగి, "అమ్మాయ్, రాధికా! వింటున్నావా?" అని హెచ్చరించాను.

పాప వులికి పడింది. "వింటున్నా, వింటున్నానంకుల్!" అంటూ కుర్చీలో సర్దుకుని కూర్చుంది.

కానీ బాలవర్ధి రాజు పెరిగి పెద్దవాడై, తల్లిని చెర విడిపించడం కోసం బయల్దేరి, దారిలో పులిరాజు పట్నం చేరుకునే సరికి, రాధిక పూర్తిగా అవశురాలై నిద్రలోకి జారి పోయింది.

దగ్గరికి వెళ్లి చెంపపైన చేయి వేసి చూచాను. ఒళ్లు వెచ్చగా వుంది.

కాలింగ్ బెల్ నొక్కగానే గంగన్న పరుగెత్తు కొచ్చాడు. అమ్మాయిని తీసుకెళ్లి మంచం పైన పడుకోబెట్టమన్నాను.

అప్పటి నుంచి ఒక ప్రశ్న నన్ను వెంటాడసాగింది. బిడ్డ ఈ స్థితిలో వుండగా, తల్లి ఆమెను వదిలి పెట్టి యింటినుంచి బయటకు ఎలా వెళ్లగలిగింది? ఆ రోజు సాయంత్రం లాజరస్‌ను అడిగాను. అలవాటు పడిపోవడంవల్ల అక్కడి వ్యవహారాలన్నీ చాలా సజావుగానే వున్నట్టు అతనికి తోస్తున్నాయి.

"మేష్టారుగారూ! ఏమనుకున్నారో మీరు?హేమాదేవి గారంటే లేడీస్ క్లబ్ సెక్రేటర్ కదండీ! ఈ నెలాఖర్లో ఎప్పుడో వాళ్ల యానివర్సిరి వుందట! ఆమె కెన్ని పన్లుంటాయి, ఏంకథా! నారాయణప్పగారి కోడలన్నాక సోషల్ యాక్టివిటీస్ లేకపోతే ఎలాగండీ! ఒకవేళ ఆమె వదులుకోవాలంటే మాత్రం లేడీస్ క్లబ్బువాళ్లు ఆమెను వదిలి వెడతారా? ఎం. ఎ. దాకా చదువుకున్నావిడ సెక్రేటర్‌గా వుందంటే క్లబ్బుకెంత పరువు, ఎంత ప్రతిష్ఠ......"

నా ప్రశ్నకు, తన సమాధానానికి పొంతన కుదరలేదని అతడు కొంచెం ఆలస్యంగా గ్రహించినట్టున్నాడు. అందుకని మళ్లీ కొనసాగించాడు–" బిడ్డకు జబ్బుగా వుందే అనుకోండి! దగ్గర తల్లి వుండిమాత్రం ప్రత్యేకంగా చేయగలిగిందేముంది? ఫోన్‌చేస్తే డాక్టరొచ్చి మందులిచ్చి వెళ్తాడు. పాలు, బ్రెడ్డూ యిస్తూ చూపెట్టుకోడానికి పనిమనుషులుండనే వున్నారు....."

ఏ ప్రశ్నకైనా లాజరస్ దగ్గర రెడీమేడ్ సమాధానాలున్నాయి. ఒక సందర్భంలో నేను నోరుజారి "ఇంత పెద్ద యింట్లో పది పన్నెండుమందిదాకా బిడ్డలుండి వుండొచ్చు. ఆదొక పెద్ద వెలితిగా తోస్తూవుంది" అన్నాను. లాజరస్ నవ్వేశాడు–" భలేవారే? బిడ్డలు లేకేమండోయ్! వాళ్లు రెసిడెన్సియల్ స్కూళ్లల్లో, కాన్వెంటుల్లో వున్నారు. సెలవులొస్తే అమ్మమ్మగారి యిండ్లకు, యింకా బంధువుల ఊళ్లకూ వెళ్తారు.



మొండి పట్టుదల



ధర్మపథం

పనిని సాధించడానికి పట్టుదల ఎంతో అవసరం. అది ప్రజోపయోగకరమైన పని విషయంలోనూ, సత్కార్యాచరణలోనూ ఉండడం ఉత్తమం. అనవసరమైన విషయాల జోక్యంలోనూ, నిష్ప్రయోజనమైన వాటిలోనూ ఉంటే శ్రమ, చెడ్డపేరు, వ్యయం మాత్రమే మిగులుతాయి. పనిపాటలు లేక, అనాయాసంగా లభించిన ఆహారం తిని, అది అరగక లేనిపోని కయ్యాలకు దిగేవారు మూర్ఖపు పట్టుదలలు పట్టి చిక్కులకు పాలుకావడం చూస్తున్నాం. ఎవరినో ఒక వ్యక్తిని పురస్కరించుకొని అతనికి ఆస్తి ఉన్నదా? అప్పు ఉన్నదా? అతడు మంచివాడా? చెడ్డవాడా? అనే అంశాలపై వాద వివాదాలకు దిగి, ఎదుటి వారితో కలహాలు పెట్టుకొని, కోర్టులకెక్కి కష్టాలను అనుభవించే మూర్ఖులు ఎందరో ఉన్నారు. అట్టివారి కోవలో చేరి మొండి పట్టుదల పట్టి, వ్యయ ప్రయాసలకు లోనయి గౌరవం పోగొట్టుకొనకుండా ఉండడం ఉత్తముల లక్షణం.

మొండి పట్టుదలవలన అనర్థానికి మన పురాణ గాథలే ప్రబల సాక్ష్యం. "భూలోకంలో ఎట్టి పరిస్థితిలోనూ ఆడితప్పని రాజు ఎవరు?" అని దేవతల రాజు ఇంద్రుడు సభ్యులను ప్రశ్నించినప్పుడు "హరిశ్చంద్ర చక్రవర్తి" అని వసిష్ఠ మహాముని చెప్పగా, ఆ మహారాజు సత్యవ్రతాన్ని గుర్తించిన మహామునులందరూ, వ్యతిరేకభావాన్ని వెల్లడించకుండా ఊరుకున్నారు. కాని విశ్వామిత్ర మహర్షి మాత్రం ఊరుకోక "ఆ రాజుచేత అసత్యం పలికించి తీరుతా"నని మొండి పట్టుపట్టినాడు. అంతేకాదు. ఆ రాజుచేత అబద్ధం పలికించలేకపోతే తన తపోభాగాన్ని ధారాదత్తం చేస్తున్నట్లు, సమస్త ద్వీపాలతో కూడిన భూమండలాన్ని ఏక చ్ఛత్రాధిపత్యంగా పాలింప చేసేటట్లు, అనంతరం ఇంద్రునితోపాటు స్వర్గ సింహాసనాన్ని అధిష్ఠింప చేసేటట్లు ప్రతిజ్ఞ చేశాడు. ముక్కు మూసుకుని అడవిలో తపస్సు చేసుకునే మునికి, హరిశ్చంద్రుడు నిజం పలికినా, లేక అబద్ధమాడినా ఒరిగేది ఏమీలేదు. ఇతర మహర్షులవలెనే ఊరుకోక, శపథంపట్టి చివరికి ఓడిపోయి చెడ్డపేరు తెచ్చుకున్నాడు. తన పంతం నెగ్గించుకునే ప్రయత్నంలో ఉత్తమ శీలుడైన ఆ చక్రవర్తి రాజ్యాన్ని కుటిల యుక్తులతో అపహరించి, భార్యా పుత్రులతో కూడా అడవులపాలు చేశాడు. అగ్ని చుట్టు ముట్టుకొన జేశాడు. ఆ రాజు భార్య చంద్రమతిని దాసిగా అమ్మించాడు. ఆ రాజును కాటి కాపరిగా చేశాడు. అతని ఏకైక పుత్రుని, పసి బాలుని చంపించాడు. చివరకారాజు తన భార్యను చంపుటకు సిద్ధ పడేటట్లు చేశాడు. ఇన్ని విధాలుగా కష్టపెట్టినా, ఆ రాజు తన సత్యవ్రతాన్ని విడువలేదు. నష్టపోయి, అవమానం పాలయినది విశ్వామిత్రుడు మాత్రమే! ఆ మహర్షి యీ పట్టుదలను ఏదైనా సత్కార్యం విషయమై చూపితే గొప్ప పేరు వచ్చేది. అనవసరంగా ఇలా మొండి పట్టుపట్టితే అనర్థం తప్పదు.

–బులుసు వేంకట రమణయ్య

బృందావనం

ఇక్కడికొచ్చి గూడా కొద్దిరోజులుంటార్లెండి" అన్నాడు.

ఆకాశంలో మబ్బులు క్రమ్ముకోడంవల్ల సూర్యుడు కనిపించకపోయిన దినాన్ని దుర్దినం అంటారట! నా పరిసంభాషలో చెప్పాలంటే బృందావనంలో గడపిన మూడో రోజు నా పాలిటికి దుర్దినమై పోయింది. చూపులు కడపదగ్గరే కాపురం పెట్టేశాయి. కళ్ళు కాయలు గాచాయి. బిడ్డ కెలావుందోనన్న బెంగ గుండెగూడులో గిరికీలు కొట్టింది. ఎదతెగని ప్రతీక్షకు చివర మధ్యాహ్నం మూడుగంటలప్పుడు మబ్బుల చిలికలోనుంచి సూర్యకిరణం ఒకటి తొంగిచూచినట్టుగా అడుగులో అడుగువేసుకుంటూ రాధిక గుమ్మంలోకి వచ్చేసింది. అక్కడామె నిలుచున్నదల్లా ఒకటి రెండు నిమిషాలు మాత్రమే!

"గుడీవినింగంకుల్! రాత్రి నాకు మళ్ళీ జొరమొచ్చిందట–! ప్రొద్దున్నే డాక్టరుగారొచ్చి చూచివెళ్ళారు. బెడ్రెస్టు తీసుకోమన్నారు. రాత్రికి తగ్గిపోతుందట– డాక్టరే చెప్పారు. మమ్మి నిద్రపోతుంటే నే వొచ్చేశాను. రేపు నాకు జొరం లేకపోతే మమ్మి క్లబ్బుకెళ్ళిపోతుంది. అప్పుడొస్తానంకుల్! మిగిలిన కథ చెబుతారా?"

"అలాగేనమ్మా! తప్పకుండా చెబుతాను" అన్నాను.

ఆనాటి సాయంకాలం హైదరాబాదు నుంచి ఒకవార్త వచ్చింది. నారాయణప్పగారి రాక మరింత ఆలస్యంగా వచ్చునట. మరునాటి ఉదయం గంగన్న చెప్పారు. బుల్లెమ్మగారిని నర్సింగ్‌హోంకు తీసుకెళుతున్నారట. అప్పుడింక నేను బృందావనంలో గోళ్ళు గిల్లుకుంటూ కూచోవలసిన అగత్యమేమి కనిపించలేదు. లాజరస్‌తో చెప్పి, సెలవుతీసుకుని చక్కా రోడ్డుపైకి వచ్చేశాను.

వస్తూ వస్తూ అనుకున్నాను. ఊరికి వెళ్ళగానే పబ్లిషరుగారికి ఉత్తరం రాయాలి. ఆయన సూచించిన ఇతివృత్తంలో నవలరాయటం నాకి జన్మలో సాధ్యం గాకపోవచ్చు. కాని నా సంతృప్తికోసం నేను రాధికను గురించి మాత్రం కథరాస్తాను. నాలుగు రోజుల బృందావనం మజిలీలో నేనా ఒక్క అమ్మాయిని మాత్రం అర్థం చేసుకో గలిగాను. ఆరోగ్యం కుదుట పడగానే ఆమె యింటికి వెళుతుంది. గదిలో కథలు చెప్పే అంకుల్‌కోసం చూస్తుంది. అతడు కనిపించడు. ఇంతకూ అతడెవరో? ఎక్కడి నుంచి వచ్చాడో? మళ్ళీ ఎప్పుడొస్తాడో? అసలొస్తాడో, రాడో? ఆమెకేమి తెలియదు. నాకైనా వీలయితే 'అమ్మా, రాధికా! బాలవద్దిరాజు మాయల మరాఠీ ప్రాణరహస్యం తెలుసుకున్నాడు. ఏడుసముద్రాల కావలినుంచి పంచవన్నెల చిలకను తీసుకొచ్చి దాని గొంతు నులిమి మాయలమరాఠీని చంపేశాడు. తల్లిని చెరనుంచి విడిపించాడు'. అంటూ మూడు ముక్కల్లోనైనా కథను సంగ్రహంగా చెప్పి ముగించాలనుంది. చాలా చిన్నకోరికే! కానీ జీవితంలో ఒక్కొక్కప్పుడు చాలా చిన్న కోరికలు గూడా తీరవేమో?

ఇంతకు నే నెవరు? రాధిక ఎవరు? ఎవరికి వారే, యమునాతీరే....... □